# శాస్త్రిగారి ఉపన్యాసం

శ్రీ వేదం వేంకటరాయశాస్త్రి మహో వ్యాఖ్యాత. ప్రసిద్ధ నాటకకర్త. సంస్కృతాంధ్రాల్లో స్వయం కృషి వల్ల అమోఘమైన పాండిత్యాన్ని సంపాదించారు. వారు వీరగ్రాంధిక వాది. అయినా నాటకాల్లో పాత్రోచిత భాషను ప్రయోగించారు.

## భాషలో తమాషాలు

గ్రాంధిక భాషావాది అయిన శాస్త్రి గారు వ్యావహారిక భాషను గ్రామ్య భాషగా పరిగణించారు. వాడుక భాష ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క విధంగా వుంటుంది. దీన్ని బట్టి వేంకటరాయ శాస్త్రిగా రొక సభలో ఉపన్యసిస్తూ ఇట్లా అన్నారు-

...ఏలూరి నుంచి దక్షిణమునకు రాగా రాగా గేదెలు బర్రెలుగా మారును. జనులు 'వెళ్లడం' మాని 'పోవడం' ఆరంభింతురు... నెల్లూరి వారు 'తాకబాక' అందురు. గోదావరి వారిని 'ముట్టుకోక' అని యెగతాళి సేయుదురు... విశాఖ పట్టణమువాడు 'నన్ను తోలెయ్యండి' అనగా, రాజమహేంద్రమువాడు 'నీవేమి పసరానివా'అని యడిగెను. రాజమహేంద్రవరపు బ్రాహ్మణు డొకడు 'నా కొక అమ్మాయి వుంది' అని చెప్పగా, మదరాసువాడు ఉంపుడుగత్తె యనుకొని ఛీ! ఛీ! యని నిందించెను... మదరాసులో ఆగంతుకుడు ఔత్తరాహుడు తన్ను 'రండ రండ'యని మదరాసువాడు గౌరవింపగా "నీయబ్బ రండ, నీ బాబు రండ...... నీవు వెధవ ముండవు" అని గొంతు పట్టుకొనెను...

ఈ విధంగా సాగిపోయింది శాస్త్రిగారి ఉపన్యాసం.

## అన్వయ సామర్థ్యం

వేదం వేంకట రాయశాస్త్రిగారొక సభలో ఒక చక్కని శ్లోకాన్ని వుటంకించి ఉపన్యసిస్తూ అర్థం చెప్పారు. అదే శ్లోకానికి వారు చెప్పిన అర్థానికి వ్యతిరేకంగా కూడా అర్థం చెప్పొచ్చునని సభలో వున్న ఒక పండితుడన్నాడు. అప్పుడు శాస్త్రిగారు ఆ పండితునితో "మీరు చెప్పే అర్థం సందర్భానికి తగదు" అంటూ

"శుక్లాం బరధరం విష్ణుం శశివర్ణం
చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోప
శాంతయే"

శ్లోకానికి గాడిద పరంగా అర్థం చెప్పి నట్టుంది" అని ఈ విధంగా అర్థం చెప్పారు.

"శుక్ల. అంబర. ధరం-ఇస్త్రీ చేసిన తెల్లని బట్టల్ని మోసేదానినీ, విష్ణుం-అంతటా వ్యాపించి యుండే దానినీ, శశివర్ణం-తెల్లగా వుండేదానినీ, చతుర్భుజం-నాలుగు కాళ్ళు కలిగినదానినీ, ప్రసన్నవదనం- ప్రసన్నమయిన ముఖం కలదానినీ, సర్వ. విఘ్న. ఉపశాంతయే-అన్ని విఘ్నాలూ- ఉపన్యాసం చెప్పేటప్పుడు ఓండ్ర పెట్టటం మొదలయినవి- తొలగిపోటానికి, ధ్యాయేత్-ధ్యానిస్తున్నాను."

నాగళ్ళ గురుప్రసాదరావు

# కాన్వెంటు అమ్మాయి

షర్మిలకు ఏడేళ్ళు వుంటాయి. తనకి నాలుగో సంవత్సరం రాగానే కాన్వెంటులో చేర్చారు. 'ఎల్' కేజి, 'యు'కేజి దాటి తనిప్పుడు రెండవ తరగతి చదువుతున్నది. ఇంగ్లీషులో పాటలు, పద్యాలు చదువుతుంది బాగా. ఎవరన్నా తెలుగులో అడిగిన నాటికి ఇంగ్లీష్‌లో సమాధానం చెప్తుంది. తనకి తెలుగు అక్షరాలు కొద్దిగా వచ్చు అంతే. చదవడం, రాయడం రాదు. తమ కూతురి ఇంగ్లీష్ నాలడ్జికి మురిసిపోతూ వుంటారు తల్లితండ్రీను.

ఆ రోజు శనివారం ఇంట్లోనే కూర్చుని ఒక ఇంగ్లీష్ పత్రికలో కార్టూన్‌లు చదువుతూ కూర్చుంది షర్మిల.

ఇంతలో వాళ్ళ మామయ్యగారమ్మాయి కల్పన వచ్చింది అక్కడికి. ఆ అమ్మాయి కూడ వాళ్ళ తమ్ముడు ప్రవీణ్ కూడా వచ్చాడు. వాడికి నాలుగేళ్ళు వుంటాయి. వాళ్ళిద్దరూ ప్రతి శనివారం అక్కడ కొస్తారు టి.వి ప్రోగ్రాములు చూడ్డానికి. కల్పన తెలుగు మీడియమ్‌లోనే చదువుకుంటున్నది. అయినా ఇంగ్లీష్ కూడా కొద్దిగా వచ్చు. కాని షర్మిల కొచ్చినంత బాగా రాదు తనకి.

"ఏం చదువుతున్నావు?" వస్తూనే షర్మిలను అడిగింది కల్పన.

"ఇది ఇంగ్లీష్ బేగ్‌జైన్" గర్వంగా చెప్పింది షర్మి. 'చూసావా నేను ఇంగ్లీష్ ఎంత ఫ్రీగా చదువుతున్నానో' అనే అహంకారం తొంగి చూసింది. ఆమాటకి కల్పన ముఖం ముడుచుకుంది.

"ఓసారి చూపిస్తాను ఇటివ్వు" షర్మిల చేతలోని పత్రిక తీసుకోబోయింది. 'ఇది ఇంగ్లీష్ పుస్తకం. నీకు చదవడం రాదుగా' వెక్కిరింతగా నవ్వింది షర్మిల పుస్తకం ఇవ్వకుండా.

ఇంతలో గదిలోంచి ప్రవీణ్ అరిచాడు "అక్కా సినిమా మొదలెట్టేసారు రా" అంటూ.

షర్మిల, కల్పన అక్కడికి వెళ్ళి చెరో కుర్చీలో కూర్చున్నారు. టి.వి.లో సినిమా పేర్లు వేస్తున్నారు.

కల్పన మనసులోనే చదువుకుంటున్నది ఆ పేర్లు. బుల్లి తెర వైపు చూస్తూ "అదేం పేరు" అడిగింది షర్మిల.

"అదేం పేరో నువ్వే చదువుకో" కసిగా గొణిగింది కల్పన. అక్క పక్కనే కూర్చున్న ప్రవీణ్ చప్పట్లు కొట్టి నవ్వుతూ "అంత పెద్దగా వున్నావు నీకు చదవడం రాదా? నువ్వు స్కూలుకి వెళ్ళడంలేదా?" అన్నాడు. ఆ మాటకి షర్మిల ముఖం మాడిపోయింది. ఆ ప్రక్కనే కూర్చున్న తల్లి మనసులోనే గతుక్కుమంది. 'రేపటి నుంచి దీనికి తెలుగు కూడా చదివించాలి' మాతృభాషని అలక్ష్యం చేశాను ఇన్నాళ్ళు' అనుకుని ఓ నిర్ణయానికొస్తూ.

ప్రభావతి


త్వరలో!

'అసురగణం' రచయిత
శ్రీ బాబాశివకోటి సీరియల్!